# రుణం.. ఎందుకింత జాప్యం

- గత ఫిబ్రవరిలో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు
- నేటికీ మంజూరు కాని నిధులు
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ అభ్యర్థుల ప్రదక్షిణలు
- సమాధానం చెప్పలేకపోతున్న బ్యాంకర్లు, అధికారులు
- ఆందోళన చెందుతున్న అభ్యర్థులు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు (ఫైల్)

ప్యాపిలి: నిరుద్యోగ యువత తమ కాళ్లపై తాము నిలబడాలన్న ఉద్దేశంతో వారికి కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ఊదరగొట్టింది. వేలాది మంది నిరుద్యోగ యువత సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూస్తుండగా ప్యాపిలి మండలానికి బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్లకు కేవలం 57 యూనిట్లు కేటాయించారు. సబ్సిడీ రుణాలు మంజూరైతే ఏదైనా యూనిట్ ఏర్పాటు చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడవచ్చని యువత భావించారు. దీంతో నిరుద్యోగ యువత ఎన్నో ఆశలు పెట్టుకుని ఆన్‌లైన్‌లో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 57 యూనిట్లకు గాను 1097 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంతో ఆర్భాటంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అభ్యర్థులు భారీ ఎత్తున తరలివచ్చారు. సుదూర గ్రామాల నుంచి అభ్యర్థులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ పెద్దల సిఫారసులు ఉన్నవారికే రుణాలు ఇస్తారన్న కారణంగా కొందరు అభ్యర్థులు రుణాలపై ఆశలు వదులుకున్నారు. మరికొందరు మాత్రం ఇంటర్వ్యూలు ముగిసినప్పటి నుంచి తమకు సబ్సిడీ రుణాలు ఎప్పుడు వస్తాయా.. అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

**అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టేనా..?**

ఎంతో ఆర్భాటంగా సబ్సిడీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు హుళక్కేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇంటర్వ్యూల ప్రక్రియ ముగిసిన తర్వాత కొద్ది రోజులకే మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అర్హుల జాబితాను సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపించారు. అయితే లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ జమ అయితే కానీ రుణాలు మంజూరు చేయని పరిస్థితిలో బ్యాంకర్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఐదు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకులు, మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిధులు లేని కారణంగానే ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. రుణాలు మంజూరు చేయలేకపోతే తమ జీవితాలతో చెలగాటం ఎందుకు ఆడాలని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

### ఆశగా ఎదురుచూస్తున్నా



ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యాను. దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లను పరిశీలించి తర్వాత సమాచారం ఇస్తామని పంపించారు. స్వతహాగా వెల్డింగ్ షాపు నిర్వహించుకుంటున్నాను. సబ్సిడీ రుణం వస్తే షాపును మరింత అభివృద్ధి చేసుకోవాలనుకున్నాను. సబ్సిడీ రుణానికి నన్ను ఎంపిక చేస్తారో..లేదో తెలియదు. సబ్సిడీ రుణం ఇస్తారని ఎదురు చూస్తున్నాను. –వెంకటేశ్, ప్యాపిలి

### అర్హుల జాబితాను బ్యాంకులకు పంపించాం



కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేశాం. అన్ని బ్యాంకులకు ఈ జాబితాను పంపించడంతో మా పని పూర్తయింది. రుణాలు మంజూరు చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపైనే ఉంది. అయితే బ్యాంకుల్లో పెండింగ్‌కు గల కారణాలు మాకు తెలియదు.

–శ్రీనివాసరావు, ఎంపీడీఓ

## క్లుప్తంగా

### వివాహిత ఆత్మహత్య

బనగానపల్లి: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని కైప గ్రామంలో శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాజేష్‌కు కడప పట్టణం వైఎస్సార్ నగర్‌కు చెందిన స్వర్ణలత(28)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో దంపతులు ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన స్వర్ణలత రసాయన పదార్థాన్ని నీటిలో కలుపుకుని తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి సోదరుడు దేవరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, మౌలిక వసతులు, తదితర వివరాలను సేకరించారు. మండల సర్వేయర్ వీరన్న, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపునకు సర్వే

కోవెలకుంట్ల: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మందులు సరఫరా చేసేందుకు కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి, సీహెచ్‌ఓ లక్ష్మి మాట్లాడుతూ.. ఎన్‌సీడీసీడీ కార్యక్రమంలో భాగంగా బీపీ, షుగర్, గుండె సంబంధిత జబ్బులు, క్యాన్సర్, థైరాయిడ్ వంటి జబ్బులతో బాధపడేవారిని గుర్తించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తామన్నారు. వీరికి ప్రతి నెలా క్రమం తప్పకుండా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. ఏఎన్‌ఎం మైమూన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### ఎంపీపీ, సర్పంచ్‌కు సత్కారం



ఎంపీపీ, సర్పంచ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: జిల్లాలో గోరుమానుకొండ గ్రామ పంచాయతీకి పనితీరులో 10వ స్థానం దక్కడంతో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లును గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సదర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామస్తుల సహకారంతో గ్రామానికి రహదారి, విద్య, వైద్యంతో పాటు సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వలు, శ్మశాన వాటికల అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సంద్రబోయిన సుంకన్న, గోవిందు, సంజీవ, శ్రీనివాసులు, మద్దిలేటి పాల్గొన్నారు.

### మోదీతో సుపరిపాలన సాధ్యం



గ్రామస్తులకు కేంద్ర పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే సుపరిపాలన సాధ్యం అయ్యిందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమంత్‌రెడ్డి అన్నారు. మోదీ పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం డోన్ మండలం దొరపల్లె, లక్ష్మంపల్లె, మల్లెంపల్లె, బొంతిరాళ్ల, వెంకటాపురం, గుమ్మకొండ గ్రామాల్లో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ నాయకులు హరినాయుడు, శివశంకర్ పాల్గొన్నారు.

### శాకాంబరీదేవిగా వాసవీమాత



బేతంచెర్ల: ఆషాఢ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా బేతంచెర్ల అమ్మవారిశాలలోని వాసవీమాత శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి 102 మంది దంపతులతో పుష్పయాగం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు గుండాగోపాల్, కందగడ్డల జానార్దన్, జగన్ మోహన్ రావు, శేషా మోహన్ పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మహిళ మృతి

బేతంచెర్ల: వాహనం ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె సమీపంలోని టోల్‌గేట్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. అటు వైపు వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె వయసు సుమారు 45 ఏళ్లు ఉంటుందని.. మానసిక స్థితి సరిగా లేక రెండు రోజులుగా ఇక్కడే తిరుగుతుండేదని స్థానికులు తెలిపారు. ఆమె వివరాలు తెలియరాలేదు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ఒక్కరు తప్ప ఎవరూలేరు!

- సేవలు అందక ప్రజల ఇక్కట్లు



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తోన్న చనుగొండ్ల గ్రామ సచివాలయం



తాళం వేసిన చనుగొండ్ల ఆర్‌ఎస్‌కే

అవుకు: ప్రజలకు స్థానికంగానే ప్రభుత్వ సేవలందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు అధికారుల పర్యవేక్షణ లోపంతో సేవలు గాడితప్పాయి. సిబ్బంది పనితీరు సరిగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కారంతో పాటు వారికి అవసరమైనా సేవలు అందించాలి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది. పంటల సాగుకు రైతన్నలు సిద్ధం అవుతున్నారు. పంటల సాగులో రైతులకు సలహాలు ఇవ్వడానికి ఆర్‌ఎస్‌కేలోని వ్యవసాయ సహాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి. అయితే అవుకు మండలం చనుగొండ్ల గ్రామ సచివాలయం, ఆర్‌ఎస్‌కేలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. గురువారం ఉదయం.11.40గంటల సమయంలో చనుగొండ్ల గ్రామ సచివాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. మొత్తం 9 మంది సిబ్బంది ఉండాల్సిన సచివాలయంలో కేవలం ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చిన ప్రజలు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగి వెళ్లారు. ఇక రైతు సేవా కేంద్రానికి అయితే ఏకంగా తాళాలు వేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండరని, సమయపాలన పాటించరని గ్రామస్తులు చెబుతున్నారు.

## వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



మాజీ ఎమ్మెల్యే కాటసానిని సత్కరిస్తున్న శ్రీనివాసనాయక్

కోవెలకుంట్ల/బనగానపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. కోవెలకుంట్లకు చెందిన శ్రీనివాస్‌నాయక్‌ను పార్టీ అధిష్టానం ఇటీవల ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యేను కలిసి శాలువ, పూలమాలతో సత్కరించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన కీలక బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన క్యాదర్శి అరదేశి దేవ పాల్గొన్నారు.

## జీవాలకు నట్టల నివారణ మందు



నట్టల నివారణ మందును తాపిస్తున్న పశువైద్యుడు

డోన్ టౌన్: గొర్రెలు, మేకలకు సంక్రమించే నట్టల వ్యాధి నివారణ కోసం ఈ నెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందు ఇవ్వనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని జగదుర్తి, వెంకటనాయునిపల్లె గ్రామాల్లో శుక్రవారం గొర్రెలు, మేకలకు మందు తాపించారు. ఈ మందు తాపడం వల్ల నట్టల నివారణతో పాటు జీవాల ఎదుగుదల ఉంటుందని తెలిపారు.

**నట్టల నివారణతో జీవాలు సురక్షితం**

బనగానపల్లె రూరల్: నట్టల నివారణతో జీవాల్లో రోగనిరోధక శక్తి పెరిగి సురక్షితంగా ఉంటాయని.. నట్టల నివారణ కార్యక్రమాన్ని పగడ్బందీగా చేపట్టాలని పశుసంవర్ధకశాఖ ఆళ్లగడ్డ డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ రమణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ మారుతిసకారం ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ.. పశువుల్లో కేవలం ఆడ దూడలు మాత్రమే పుట్టే ఎద సూదులను రూ.150లకే ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని.. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిపై పశువైద్య సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, హుస్సేన్, శ్రీకాంత్‌రెడ్డి, భారతిరెడ్డి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

## ప్యాపిలిలో 11 నుంచి మొహర్రం వేడుకలు



సమావేశమైన గ్రామపెద్దలు

ప్యాపిలి: మండల కేంద్రంలో జూలై 11 నుంచి మొహర్రం వేడుకలు జరిగేలా ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు బోరెడ్డి పుల్లారెడ్డి, బోరెడ్డి రాము, టి. శ్రీనివాసులు సమక్షంలో ముజావర్లు నిర్ణయించుకున్నారు. మొహర్రం వేడుకల నిర్వహణ గురించి శుక్రవారం స్థానిక గంగమ్మ కట్ట వద్ద గ్రామపెద్దలు, ముజావర్లు సమావేశమయ్యారు. శుక్రవారం నుంచే మొహర్రం వేడుకలు జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేయాల్సి వచ్చిందని గ్రామ పెద్దలు తెలిపారు. జూలై 16న ఐదు రోజుల సరిగెత్తు, 18న చిన్న సరిగెత్తు, 20న పెద్ద సరిగెత్తు, 21న మొహర్రం ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బోరెడ్డి కృష్ణారెడ్డి, గండికోట చిన్నరామాంజనేయులు జింకల అంజి పాల్గొన్నారు.

## అలేబాదులో తీవ్ర నీటి ఎద్దడి



నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. అలేబాదు గ్రామంలో 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఒకే ఒక్క మోటర్, ఒక చేతి పంపు మాత్రమే ఉన్నాయి. భూగర్భ జలాలు లేక పోవడంతో ప్రత్యామ్నాయంగా మునిమడుగు గ్రామం నుంచి అలేబాదుకు ట్యాంకుకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. అయితే మూడు రోజుల క్రితం పైప్‌లైన్ లీకేజీ కారణంగా అలేబాదు ట్యాంకుకు నీటి సరఫరా జరగడం లేదు. దీంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్‌ను వివరణ కోరగా పైప్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

బనగానపల్లె రూరల్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో రూ.14 లక్షల నిధులతో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని డిగ్రీ కళాశాల ఫీడర్ కింద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్, సీపీఐ ఆఫీసు, త్రివర్ణ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని.. ప్రజలు సహకరించాలని కోరారు.

### కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కోర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర విభాగాల్లో 35 రోజుల పాటు ఉచిత భోజన వసతి సదుపాయాలతో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయస్సు, పది ఆపై చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### బాధ్యతల స్వీకరణ

ప్యాపిలి: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిగా రంగారెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలులోని ప్రాంతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇది వరకు ప్యాపిలిలో పనిచేసిన వైద్యాధికారిణి వాణిశ్రీ ప్రాతకోట పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా కిషోర్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మిడుతూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

### విద్యామిత్ర కానుక అందజేత



కిట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే, ఆర్డీఓ

బేతంచెర్ల: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు విద్యామిత్ర కానుకను అందజేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానని కోట్ల తెలిపారు. ఆర్డీఓ నరసింహులు, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి ప్రతిమ

బనగానపల్లె రూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రతిమ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అతిథిగా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంటర్మీడియెట్ దశ ఎంతో కీలకమన్నారు. ఈ సమయంలో వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. తల్లిదండ్రులను కష్టాలను దృష్టిలో ఉంచుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆనందరావు, ప్యానల్ న్యాయవాదులు తులసీశ్వరమ్మ, రఘురామిరెడ్డి, అజాంహుస్సేన్, అల్లావుద్దీన్, ముజాహీర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తనఖా లేకుండా వ్యవసాయ రుణాలు

- కెనరా బ్యాంక్ సీజీఎం మీతాంతయ



కోవెలకుంట్లలో కెనరా బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం

కోవెలకుంట్ల: కెనరా బ్యాంకు ద్వారా రైతులకు తనఖా లేకుండానే వ్యవసాయయ రుణాలు అందజేస్తున్నామని ఆ బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ మీతాంతయ తెలిపారు. పట్టణంలోని నాగులకట్ట సమీపంలో కెనరా బ్యాంకు నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా బ్యాంకు కర్నూలు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, చీఫ్ మేనేజర్ మనోహర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ వాసగిరి సాయికృష్ణమూర్తి, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. రైతులకు బ్యాంకు ద్వారా గతంలో రూ. 2.50 లక్షల వరకు వ్యవసాయ రుణాలు అందించేవారని, ఆ మొత్తాన్ని రూ. 3 లక్షలకు పెంచామన్నారు. మినిమమ్ బ్యాలెన్స్ లేకున్నా ఎలాంటి అపరాధ రుసుం చెల్లించకుండానే సేవింగ్స్ ఖాతాను కొనసాగించుకునే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులకు రూ. 10 లక్షల వరకు క్యాన్సర్ కేర్ ఇన్స్యూరెన్స్, రూ. 26 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. బ్రాంచ్ మేనేజర్ సద్దాం అలీ, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**సంజామలలో కెనరా బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం**

సంజామల: మండల కేంద్రంలో కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్కిల్ జనరల్ మేనేజర్ మీతాంతియా, కర్నూల్ ఏజీఎం సుశాంత్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## అల్ట్రాటెక్ వాహనాల అడ్డగింత



రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న అల్ట్రాటెక్ ప్రతినిధులు

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని కొండపై అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ సామగ్రి, ఇతర పరికరాలను కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కు మీదుగా రవాణ సాగిస్తున్నారు. రైతులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఫిర్యాదుతో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు వాహనాల రాకపోకలను సిబ్బందితో కలిసి నిలిపివేయించారు. సీఐ రమేష్‌బాబు సిబ్బందితో అక్కడే మకాం వేశారు. ఇండస్ట్రియల్ పార్కులో భారీ వాహనాలు వెళ్లడం వల్ల కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ తెలిపారు. అయితే ఏపీఐఐసీ అధికారుల అనుమతితో ఈరోడ్డు మీదుగా రాకపోకలు సాగించేందుకు అనుమతి తీసుకున్నామని అల్ట్రాటెక్ కంపెనీ ప్రతినిధులు పత్రాలను చూపించారు. వీటి గురించి తహసీల్దార్ ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో గ్రావెల్‌తో చదును చేపడుతున్నారు. రెండు గంటలకు పైగానే వాహనాలు నిలిపివేశారు. సుదీర్ఘ చర్చల అనంతరం వాహనాలకు అనుమతి ఇచ్చారు. గ్రావెల్ ఏర్పాటు చేయాలని, దుమ్ము లేవకుండా రోజు నీళ్లు వదలాలని తహసీల్దార్ సూచించారు. రోడ్డును కేవలం తాత్కాలికంగా మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. ఫ్యాక్టరీకి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని.. మూడు నెలల్లో పూర్తి అవుతాయని కంపెనీ ప్రతినిధులు అధికారులకు వివరించారు.

**వన్యప్రాణులు విలవిల**

ఇండస్ట్రియల్ పార్కు సమీపంలో సువిశాలమైన ప్రాంతం ఉండడంతో వన్యప్రాణులు ఈ ప్రాంతంలో ఆవాసంగా మార్చుకున్నాయి. కుందేళ్లు, జింకలు, నెమళ్లు పదుల సంఖ్యలో పార్కు పరిసరాల్లో సంచరిస్తుంటాయి. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో వాహనాల రాకపోకలు, నిర్మాణ పనుల శబ్దాలతో వన్యప్రాణులు భయాందోళనకు గురవుతున్నాయి.

## 104 సేవలను సద్వినియోగం చేసుకోండి

అవుకు: పీహెచ్‌సీల పరిధిలో అందించే 104 వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆకుమళ్ల పీహెచ్‌సీ డాక్టర్ జయభారత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుంకేసుల గ్రామంలో 104 వాహనం ద్వారా సంచార చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సుమారు 100 మందికి బీపీ, షుగర్, టీబీ తదితర పరీక్షలు చేసి మందులు అందజేశామని ఆయన తెలిపారు.

అలాగే గర్భిణులకు పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. ప్రతి సెంటర్‌లో నెలకు రెండు సార్లు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

## అడుగంటుతున్న ఆశలు

- బోర్లలో తగ్గుతున్న భూగర్భ జలాలు



సద్దలవెంగన్న చెరువులో స్వల్పంగా ఉన్న నీరు

కొలిమిగుండ్ల: నైరుతి రుతుపవనాలు ముందుగా ప్రవేశించడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని రైతులు సంతోషపడ్డారు. తొలకపాటి నుంచి మోస్తరు వానలు కురవడంతో రైతులు నిరాశలో మునిగిపోయారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు పొలాల్లో పనులు చేస్తున్నారు. రోజు ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుంటున్నా ఆశించిన స్థాయిలో వర్షం కురవడం లేదు. గత ఏడాది సైతం వర్షపాతం అంతంత మాత్రమే నమోదు కావడంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. వేసవి ముగిసినా కొన్ని గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ బోర్లలో రోజు రోజుకు నీళ్ల తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొలిమిగుండ్ల సమీపంలోని సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినపేట, హనుమంతుగుండంలోని చిన్న, పెద్ద చెరువులతో పాటు అబ్దులాపురంలోని దెయ్యాల చెరువులో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. వరుణుడు కరుణిస్తే సాగు, తాగునీటి సమస్య తొలగిపోనున్నాయి.